ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల
జిల్లా వార్తలు

5

బుధవారం 29 అక్టోబరు 2025

వణికిస్తున్న మొంథా

మొంథా తుఫాన్ వణుకు జిల్లా వ్యాప్తంగా మొదలైంది. మూడు రోజుల నుంచి మొంథా తుఫాన్ ప్రభావం జిల్లాలో కనిపిస్తోంది. సోమ, మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. నేడు ఈదురు గాలులతో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అందువల్ల రవాణా, విద్యుత్, తాగునీటి, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. జిల్లాలోని నంద్యాల, డోన్, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో



పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అత్యధికంగా నంద్యాల డివిజన్‌లో 122 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు చాగలమర్రి మండలంలో అత్యధికంగా 61.75, ఆళ్లగడ్డ 59.0, నంద్యాల 53.0, బేతంచెర్ల 37.75, రుద్రవరం 37.70, ఉయ్యాలవాడ 36.5, సంజామల 36.0, అవుకు 31.75, బనగానపల్లె 23.75, నందికొట్కూరు 18.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి.

● నంద్యాల/నంద్యాల ఎడ్యుకేషన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి)



నేలంపాడు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ప్రవహిస్తున్న వరద నీరు

● ఎడతెరపిలేని వర్షం
● చాగలమర్రిలో అత్యధికంగా వర్షపాతం నమోదు
● దెబ్బతిన్న వరిపంట

ఎడతెరిపి లేని వాన


చాగలమర్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో భారీ వర్షం కురుస్తోంది. దీంతో పంటలు పూర్తిగా దెబ్బతినిపోయాయి. పౌర జీవితం స్తంభించిపోయింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారమంతా వర్షం పడుతూనే ఉంది. 61.75 మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రోజువారి కూలీలు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు ఇబ్బంది పడ్డారు.

మండలంలోని నేలంపాడు, గొట్లూరు గ్రామాల సమీపంలో వరద నీరు పంట పొలాల్లో ప్రవహించి రైతులు సాగు చేసిన పంటలు నీట మునిగి భారీ నష్టం వాటిల్లింది. పొలాల్లోని వరద నీరు రహదారి వెంట ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు చేసేందుకు అవస్థలు పడ్డారు. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె, వక్కిలేరు వంతెనపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. ముత్యాలపాడు, గొడిగనూరు, శెట్టివీడు, మూడురాళ్లపల్లె, జ్ఞానాపురం, చాగలమర్రి, మద్దూరు, పెద్దబోదనం, చిన్నబోదనం గ్రామాల రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న తడిసి దెబ్బతింది. కొందరు రైతులు ధాన్యం తడవకుండా వర్షంలోనే పట్టాలు కప్పే ప్రయత్నం చేశారు. మరి కొందరు పట్టాలపై ఉన్న నీటిని తొలగించుకుంటూ ధాన్యం వద్దే జాగరణ చేశారు. ఎస్ఐ సురేష్ మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి మట్టిమిద్దెల్లో నివాసం ఉంటున్నవారిని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. నేలంపాడు గ్రామంలో సచివాలయం, చాగలమర్రి ఆర్సీఎం పాఠశాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. మట్టిమిద్దెల్లో నివాసం ఉంటున్నవారికి ముందస్తుగా నోటీసులు జారీ చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. గ్రామాల్లో తుఫాన్ ప్రభావ పరిస్థితిని ఎస్ఐ, తహసీల్దార్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

నీట మునిగిన ఉల్లిగడ్డలు

మొంథా తుఫాన్ ప్రభావంతో ఉల్లి రైతులను కన్నీరు పెట్టిస్తోంది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ఆవులపల్లెలో నాగరాజు అనే రైతు 4 ఎకరాల్లో ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టి ఉల్లి పంట సాగు చేస్తే తుఫానుకు పంట దిగుబడి దెబ్బతింది. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదని, ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కోరాడు.

ప్రకృతి ప్రకోపం ..



పట్టాలు కప్పిన మొక్కజొన్నలోకి నీరు చేరుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి తడిసిన మొక్కజొన్న దిగుబడిని రైతులు ఆరబెట్టుకునేలోపే మళ్లీ మొంథా తుఫాన్ రైతులపై విరుచుకుపడటంతో అన్నదాతల ఆవేదనకు అంతు లేకుండా పోతోంది. కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల, బెలుం, బెలుం శింగవరం, నందిపాడు, కొలిమిగుండ్ల తదితర గ్రామాల్లో సుమారు 1400 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా, 500ఎకరాల్లో ఇప్పటికే మొక్కజొన్న నూర్పిడి చేసుకొని ఆరబెట్టుకున్నారు. మొక్కజొన్న రైతులను మొంథా తుఫాన్ రైతును నిండా ముంచేస్తోంది. కోత కోయని మొక్క జొన్నకు సైతం తుఫాన్ కారణంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నట్టేట ముంచిన వాన

ప్యాపిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి పంటలు సర్వనాశనమయ్యాయి. ప్యాపిలి, కలచట్ల, ఏనుగమర్రి, హుసేనాపురం, వెంగళాంపల్లి, రాచెర్ల, ఊటకొండ, జలదుర్గం, చంద్రపల్లి, పీఆర్‌పల్లి తదితర గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సజ్జ, టమోట, మొక్కజొన్న, వేరుశనగ పంటలు నీట మునిగాయి. కోత కోసి ఆరబెట్టుకున్న సజ్జ, ఆముదం పంట దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. 5 ఎకరాల్లో సజ్జ పంట నాశనమైందని రాచెర్ల గ్రామానికి చెందిన కంబగిరిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.



ప్యాపిలి: రాచెర్లలో వర్షానికి తడిసి ముద్దయిన సజ్జ పంట

నేడు జిల్లాకు భారీ వర్ష సూచన

నంద్యాల/నంద్యాల ఎడ్యుకేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరం దాటిన సందర్భంగా నంద్యాల జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముందని భారత వాతావరణ సంస్థ హెచ్చరించింది. పెనుగాలులు గంటకు 60 కిలోమీటర్ల నుంచి 70 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లు, బలహీనమైన నిర్మాణాలు, గుడిసెలు కూలే అవకాశముందని, ప్రజలు సురక్షితమైన ప్రదేశాల్లో ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

తడిసిన మొక్కజొన్నలు

రుద్రవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫానుతో రైతు వెన్నులో వణుకు పుట్టింది. మంగళవారం రుద్రవరం మండలంలో భారీ వర్షం కురిసింది. మండలంలో 12,625 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. 30వేల క్వింటాళ్లల్లో మొక్కజొన్నలు మొలకెత్తాయని రైతులు లబోదిబోమంటున్నారు. పంటపొలాల్లో కోతలు కోసి రహదారులు, పంట పొలాల్లో కాల్వ గట్లపై ఆరబోసిన మొక్కజొన్నలు వరుసగా వర్షాలు కురియడంతో మొలకెత్తాయని రైతులు వాపోయారు. చిత్తరేణిపల్లె, వెలగలపల్లె, చిన్నకంబలూరు, కోటకొండ గ్రామాల్లో వరి పంట 1200 ఎకరాల్లో నేలకూలింది. దీంతో పాటు



మొక్కజొన్న పంట 1200 ఎకరాల్లో నేలవాలింది. సుమారు 30వేల క్వింటాళ్ల మొక్కజొన్నలు తడిసి మొలకెత్తాయని రైతులు వాపోయారు.



బండి ఆత్మకూరులో నేల కూలిన వరి పంట

వణికిస్తున్న తుఫాన్

బండిఆత్మకూరు అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలోని 20 గ్రామాల్లో జోరు వాన కురిసింది. మండలంలో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల సమయానికి సుమారు 40మిల్లీ మీటర్ల వర్షం కురిసినట్లు తెలిసింది. మండలంలోని పలు వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటం, ఎగువ ప్రాంతాల వరద నీరు వెరసి సంతజూటూరు పికప్ అనకట్ట వద్ద వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. దీంతో కుందూనది ప్రవాహం సైతం పెరిగింది. వరి పంట నేల కూలుతుండటం, మొక్కజొన్న, సోయాబీన్ ధాన్యం ఆరబోత, కోయాల్సిన పంటలు తడిసి కూలిపోతున్నాయి. ఈదురు గాలుల ధాటికి జనం ఇళ్ళు విడచి బయటకు రావటం లేదు.

అవినీతిరహిత రాష్ట్రమే మనందరి లక్ష్యం

● కలెక్టర్ రాజకుమారి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత రాష్ట్రమే మనందరి లక్ష్యమని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి అవినీతి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా టోల్‌ఫ్రీ నెం 1064 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు ఎక్కడైనా అవినీతి ఘటనలు గమనించినపుడు వెంటనే టోల్‌ఫ్రీ నెం 1064కు సమాచారమివ్వాలని కోరారు. అన్నిశాఖల అధికారులు ప్రజలకు అవినీతి రహిత సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు కృష్ణయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

సదరం క్యాంపులు వాయిదా

నంద్యాల టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఈనెల 29, 30, 31వ తేదీల్లో జరగాల్సిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం సదరం అప్పీల్ పునఃపరిశీలన క్యాంపుల వాయిదా వేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపుల విషయం త్వరలో ఆయా మండలాల సచివాలయ సిబ్బంది ద్వారా తెలియజేస్తామని పేర్కొన్నారు. సంబంధిత ఎంపీ డీవోలు, పురపాలక కమిషనర్లు చర్యలు తీసుకుని సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు సమాచారం చేరేలా చూడాలని సూచించారు.

శ్రీశైల దేవస్థానంలో అంతర్గత బదిలీలు

శ్రీశైలం అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల దేవస్థానం ప్రధాన విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బందికి పరిపాలనా సౌలభ్యం కోసం అంతర్గత బదిలీలు చేస్తూ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈవో శ్రీనివాసరావు ప్రకటించారు. ప్రధానంగా ఆలయ విభాగం, అకామిడేషన్, అన్నదానం, రెవెన్యూ, హార్టికల్చర్, అకౌంటింగ్, పెట్రోల్ బంక్, టోల్‌గేట్, క్యూలైన్ల నిర్వహణ వంటి కీలక స్థానాల్లో ఉన్న సూపరింటెండెంట్లు హర్యానాయక్, రవికుమార్, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసులు లోకేశ్వరప్ప, రికార్డ్ అసిస్టెంట్లు మహేష్ నాయక్, అశోక్, పోలయ్య, విమల, దివ్య, ఇంద్రజలతోపాటు మొత్తం 26 మందిని వివిధ విభాగాలకు స్థాన చలనం కల్పిస్తూ జారీ అయిన ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని ఈవో తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్.. డేంజర్

● ప్రతి నలుగురిలో ఒకరికి
● యువతలో పెరుగుతున్న వ్యాధి
● నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే 6

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు 7

రికార్డులు సక్రమంగా నిర్వహించండి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి



మద్యం డిపోలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

నంద్యాల టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మద్యం డిపోలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అక్కడి సిబ్బందిని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశించారు. పట్టణంలోని ఆటోనగర్‌లో ఉన్న మద్యం డిపోను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో మూడు రోజుల పాటు వర్షాలు ఉన్నందున మద్యం డిపోలో సీలింగ్ జరిగిందా లేదా అని పరిశీలించారు. అన్నిరకాల బ్రాండ్ల అమ్మకాలు ఎలా ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా కూడా లెక్కల్లో తారతమ్యం లేకుండా రికార్డులు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రికార్డులు పరిశీలించి అమ్మకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నగేశ్‌కుమార్, ఎక్సైజ్ సూపర్‌వైజర్ అధికారి కోటారెడ్డి, ఇన్‌స్పెక్టర్ కృష్ణానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలం - దోర్నాల మధ్య నిలిపివేసిన రాకపోకలు



శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్ల మధ్య నిలిపివేసిన వాహనాలు

శ్రీశైలం అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం-దోర్నాల ఘాట్ రోడ్ల మధ్య రాకపోకలు నిలిపివేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. భారీవర్షాల కారణంగా తుమ్మలబైలు, చింతలగూడెం వద్ద వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో అధికారుల ఆదేశాల మేరకు అటవీశాఖ చెక్‌పోస్టులను మూసివేసి వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. దోర్నాల, శిఖరేశ్వరం వద్ద ఉదయం 6 గంటలకు వాహనాలను పంపించనున్నారు. శ్రీశైలం వచ్చే యాత్రికులు గమనించుకోవాలన్నారు.

పొంగిపొర్లిన సిద్ధాపురం చెరువు..!

● ఆత్మకూరు - దోర్నాల రహదారిపై స్తంభించిన రాకపోకలు
● విజయవాడకు వెళ్లే వాహనాలను గిద్దలూరు మీదుగా మళ్లింపు

ఆత్మకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో సంభవించిన మొంథా తుఫాన్ ధాటికి ఆత్మకూరు ప్రాంతంలోని నల్లమల అడవుల్లో కురిసిన భారీ వర్షాలకు మంగళవారం రాత్రి సిద్ధాపురం చెరువు పొంగి పొర్లింది. ఫారెస్ట్ బేస్ క్యాంపు సమీపంలోని అలుగు నుంచి గాలేరు వాగులోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అదే క్రమంలో కేజీ రోడ్డు సమీపంలోని మరో అలుగు నుంచి నీరు కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి మీదుగా ప్రవహిస్తూ అటవీ ప్రాంతంలోకి చేరుతోంది. దీంతో ఆత్మకూరు - దోర్నాల రహదారిపై నీటి ఉధృతి అధికమవ్వడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, అర్బన్ సీఐ రాము, ఎస్సై డీవీ. నారాయణరెడ్డి అక్కడికి వెళ్లి పరిశీలించి అటుగా వాహనాల రాకపోకలు జరపకుండా అప్రమత్తమైన చర్యలు చేపట్టారు. రాత్రివేళ కావడంతో ఏవైనా వాహనాలు నీటి ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేసి ఏదైనా ప్రమాదంలో చిక్కుకునే అవకాశం ఉండటంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోల మేనేజర్లకు సమాచారం చేరవేసి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను ఆత్మకూరు నుంచి కాకుండా గిద్దలూరు మీదుగా వెళ్లాలని సూచించారు. దోర్నాల పోలీసులను కూడా అప్రమత్తం చేసి ఆత్మకూరు వైపు వచ్చే వాహనాలను గిద్దలూరు, నంద్యాల మీదుగా దారి మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా సిద్ధాపురం చెరువు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి అప్రమత్తమైన చర్యలు చేపట్టారు. కేజీరోడ్డుపై నీటి ప్రవాహ ఉధృతి తగ్గే వరకు వాహనాలను అనుమతించమని పోలీసులు స్పష్టం చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

● భారీ వర్షాలు కురుస్తాయి ● కలెక్టర్ రాజకుమారి



నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ రైతులు పంట కోతలను వాయిదాలు వేసుకోవాలన్నారు. ప్రజలు మట్టి మిద్దెలలో నివాసం ఉండరాదన్నారు. స్తంభాల వద్ద, చెట్ల కింద ప్రజలు నిలువరాదన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటికి రావద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా సరాసరి సగటు వర్షపాతం 3 సెంటీ మీటర్లు నమోదైందన్నారు. తుఫాన్, వర్షం సంబంధిత అత్యవసర పరిస్థితులలో కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంనెం 08514.... 293903కు ఫోన్ చేయాలని సూచించారు. అవుకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన 14 మంది ప్రయాణికులకు అవుకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందిస్తున్నారని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. బస్సు డ్రైవర్‌తో పాటు మరో ప్రయాణికుడిని మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. ప్రమాదంలో లక్ష్మీదేవి (55) మృతి చెందారన్నారు.


ప్రజలు బయటకు రావొద్దు

● ఎస్పీ సునీల్ షెరాన్




నంద్యాల టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకు మొంథా తుపాన్ ప్రభావంతో ఆరెంజ్ అలర్ట్ ఇచ్చిన నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ఎస్పీ సునీల్ షెరాన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్న సందర్భంగా జాతీయ రహదారిపై ప్రయాణించే భారీవాహనాలు కూడా రాత్రి ఏడు గంటల తర్వాత సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలన్నారు. ఈదురు గాలులు వీస్తున్న నేపథ్యంలో చెట్లు, స్తంభాల కింద నిలబడరాదన్నారు. వాగులు, వంకలు, నదులు లాంటి ప్రాంతాల్లో ఉండే వారు ప్రమాదమని తెలిసిన వెంటనే రెవెన్యూ, పోలీసు, పరిపాలన అధికారులకు సమాచారం అందించాలన్నారు.

శ్రీశైలానికి పెరుగుతున్న వరద



శ్రీశైలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైల జలాశయానికి వరద పెరుగుతోంది. మంగళవారం జూరాల ప్రాజెక్ట్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా 37,860 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 45,111 క్యూసెక్కులు హంద్రీ ద్వారా 2,000 క్యూసెక్కుల నీరు విడుదలైంది. సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి 82,742 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరిన ట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకుగాను 882.70అడుగులకు చేరింది. నీటిసామర్థ్యం 215.80 టీఎంసీలకుగాను 202.9673 టీఎంసీలుగా నమోదైంది.

బ్రెయిన్ స్ట్రోక్.. డేంజర్



- ప్రతి నలుగురిలో ఒకరికి
- యువతలో పెరుగుతున్న వ్యాధి
- ఆసరా ఇస్తున్న కర్నూలు జీజీహెచ్ బ్లాక్ యూనిట్
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే

మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, జన్యుపరమైన కారణాలతో 25 ఏళ్లలోపు యువత బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు. ఒకప్పుడు 60-70 ఏళ్ల వయస్సులో ఈ సమస్య కనిపించేది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 25 ఏళ్లు పైబడిన ప్రతి నలుగురిలో ఒకరికి స్ట్రోక్ వస్తున్నది. పక్షవాతంపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం 2006 నుంచి వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ ప్రపంచ పక్షవాత నివారణ దినాన్ని పాటిస్తున్నది. ఈ ఏడాది లక్షణాలు గుర్తించండి.. ప్రాణాలను కాపాడండి.. అన్న నినాదాన్ని ప్రజలకు అందించింది.

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మనదేశంలో ప్రతి లక్ష మందికి 145 మంది బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు. ప్రతి నిమిషానికి ముగ్గురు బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్నారు. రక్తం గడ్డ కట్టడం ద్వారా రక్త నాళాలు పూర్తిగా లేదా పాక్షికంగా మూసుకుపోయి మెదడుకు రక్త సరఫరా సక్రమంగా జరగకపోవడం స్ట్రోక్‌కు కారణమవుతోంది. దీనికి హైబీపీ, మధుమేహం, పొగ తాగడం, ఒత్తిడి కారణాలని వైద్యులు చెబుతున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండా అకస్మాత్తుగా వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా యువకుల్లో ఇప్పుడు స్ట్రోక్ సాధారణంగా మారుతుంది. ప్రారంభ దశలోనే లక్షణాలను గుర్తించడం చాలా కీలకం. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన వారు స్ట్రోక్‌కు గురయ్యేవారు. ఇప్పుడు 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు వారు స్ట్రోక్‌కు గురవుతున్నారు.

ఎలా గుర్తించాలి... ?

- ఒక వైపు చేయి, కాలు పని చేయకపోవడం
- ఆకస్మాత్తుగా తల తిరగడం, శరీరం అదుపు తప్పడం
- మూతి ఒక వైపునకు వంకర పోవడం
- దృష్టి ఇబ్బందులు.. వ్యక్తిని సరిగ్గా చూడకపోవడం
- ఆకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, స్పృహ కోల్పోవడం

బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణాలు

ముందస్తు సూచనలు లేకుండా మెదడుకు ఆక్సిజన్, పోషకాలను తీసుకెళ్లే రక్తనాళాలకు అవరోధం కలగడం, చిట్లడం వల్ల మెదడు లోని కొంతభాగం మరణానికి దారితీసి స్ట్రోక్‌కు గురవుతారు.

- స్మోకింగ్, ఆల్కహాల్ ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.
- జీవన విధానంలో మార్పులు, హైబీపీ, మధుమేహం, కొలస్ట్రాల్, ఊబకాయం, గర్భనిరోధక మాత్రలు వాడిన మహిళల్లో స్ట్రోక్ వచ్చే అవకాశం.

రకాలు: పక్షవాతంలో రెండు రకాలు. ఒకటి ఇస్కిమిన్ స్ట్రోక్. రక్తనాళంలో అడ్డంకుల కారణంగా ఈ స్ట్రోక్ వస్తుంది. పక్షవాతానికి గురయ్యేవారిలో 80 శాతం ఈ రకమైన పక్షవాతానికి గురవుతున్నారు. రెండో రకం రక్తనాళం చిట్లడం వల్ల హిమరెజిక్ స్ట్రోక్ వస్తుంది.



న్యూరో ఐసీయూలో కార్పొరేట్ వైద్యం

గత రెండేళ్ల క్రితం కర్నూలు జీజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో 12 పడకలతో స్ట్రోక్ ఐసీయూ యూనిట్‌లో కార్పొరేట్ వైద్యం అందుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలతో పాటు మరో ఆరు జిల్లాల నుంచి ప్రతి నెలా 1500 నుంచి 2వేల వరకు రోగులు న్యూరాలజీ ఓపీకి వస్తుంటారు. ఇక స్ట్రోక్ ఐసీయూతో పాటు ప్రతి నెలా న్యూరాలజీ విభాగంలో 150 మంది రోగులకు చికిత్స అందిస్తున్నారు. న్యూరాలజీ విభాగానికి ప్రతి సోమ, గురువారాలు ఓపీ ఉంటుంది. మిగతా రోజుల్లో అత్యవసరమైన రోగులకు న్యూరాలజీ విభాగం వద్ద ఓపీ సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బ్రెయిన్ స్ట్రోక్ రోగులు 80వేల మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కర్నూలు నంద్యాలలోని ప్రైవేటు హాస్పిటల్స్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స అందిస్తున్నారు.

మొదటి 4 గంటలు కీలకం



బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన తర్వాత మొదటి 4-5 గంటలు అత్యంత కీలకం. చికిత్స విధానం స్ట్రోక్ రకంపై ఆధారపడి ఉంటుంది. రక్తనాళాల్లో అడ్డంకుల వల్ల వచ్చే స్ట్రోక్, ఇస్కిమక్ స్ట్రోక్, థ్రాంబో లైటిక్ థెరపి, మెకానికల్ థ్రాంబెక్టమి వంటివి ఉంటాయి.

- డా.చల్లెపల్లి బాబురావు, కన్సల్టెంట్ , కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

స్ట్రోక్ కేసులు పెరిగాయి



గతంతో పోలిస్తే బ్రెయిన్ స్ట్రోక్ కేసులు పెరిగాయి. ప్రతి నెల ఐసీయూ స్ట్రోక్ యూనిట్‌కు దాదాపు 90 కేసులు వస్తాయి. స్ట్రోక్ యూనిట్ వచ్చిన తర్వాత ఆధునిక వైద్య చికిత్స కూడా వచ్చాయి. న్యూరాలజీ ఓపీ వారంలో సోమ, గురువారాల్లో ఉంటుంది. ఇందులో 500 ఓపీకి వస్తుంటారు. స్ట్రోక్ ఐసీయూ యూనిట్‌లో 12 పడకలు ఉంటాయి.

- డా.సి. శ్రీనివాసులు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, న్యూరాలజీ విభాగం, జీజీహెచ్ , కర్నూలు

జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్లే..



యువకుల్లో స్ట్రోక్ పెరగడానికి జీవనశైలిలో వచ్చిన మార్పులే కారణం. జంక్ ఫుడ్ తినడం, వ్యాయామం లేకపోవడం, తక్కువ నిద్ర, అధిక స్కీన్ టైమ్, ఒత్తిడి, చిన్న వయస్సులోనే బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

- డా. రఘునందిని, కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: కలెక్టర్

కోడుమూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ ఏ.సిరి ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిలోకి వెళ్లి కూరగాయలను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా? అని ప్రధానోపాధ్యాయులు ఇందిరాదేవిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో నీటి సమస్య ఉందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆమె స్పందిస్తూ డీఎంఎఫ్ నిధులతో వారంలో రోజుల్లో బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

దళారులను దరి చేరనీయవద్దు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రాల్లో బుధవారం రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయాలని, దళారులను దరి చేరనీయవద్దని కలెక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. గూడూరు మండలం పెంచికలపాడులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి వ్యవసాయ శాఖ కర్నూలు ఏడీఏ శాలురెడ్డి, కోడుమూరు మార్కెట్ కమిటి కార్యదర్శి సుందర్‌రాజు, సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్లకు సంబంధించి పలు సూచనలు అందజేశారు. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న పత్తి నాణ్యత, నిల్వ సదుపాయాలు, యంత్రాల పనితీరు, కార్మికుల భద్రతా చర్యలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించారు.

నాపరాయి పరిశ్రమను ఆదుకోవాలి

బనగానపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సంక్షోభంలో ఉన్న నాపరాయి పరిశ్రమను ఆదుకోవాలని మైనింగ్ ఓనర్లు, కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలుకూరు గ్రామ క్రాస్ రోడ్డు వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. బనగానపల్లె, బేతంచెర్ల మండలాలకు చెందిన నాపరాయి మైనింగ్ ఓనర్లు, ట్రాక్టర్ యజమానులు, నాపరాయి కార్మికులు వందల ట్రాక్టర్లను రోడ్లపై నిలిపి ధర్నా చేశారు. మైనింగ్ ఓనర్లు, కార్మికులు, ట్రాక్టర్ యజమానులు మాట్లాడుతూ ఓ ట్రాక్టర్‌కు రెట్టింపు సంఖ్యలో రాయల్టీ వసూలు చేస్తున్నారన్నారు. ఒక టన్ను నాపరాయికి రూ.220లు చెల్లించాలని హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన వారు టెండర్ వేసి ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే డీజిల్, విద్యుత్ ధరలు అధికంగా ఉండడం, రవాణా ఖర్చులు పెరిగిపోయాయన్నారు. దీనికి తోడు దినసరి కూలీ రేట్లు పెరిగాయన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి జోక్యం చేసుకొని ప్రభుత్వ దృష్టికి నాపరాయి పరిశ్రమ దుస్థితిని వివరించి రాయల్టీలు తగ్గించి నాపరాయి పరిశ్రమను ఆదుకోవాలని కోరారు.



ధర్నా చేస్తున్న మైనింగ్ ఓనర్లు, కార్మికులు

చిత్రజ్యోతి

SINCE 1965

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర, 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ఠ్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.

ఉగాదిన విడుదల



అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి

దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగిన్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబానో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ

కర్నూలు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో అవసరమైతేనే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. జిల్లా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారని లోతట్టు, నదీతీర ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు పాటించాలన్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు

నంద్యాల రూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ముంచుకొస్తున్న నేపథ్యంలో నంద్యాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున మంగళవారం లోతట్టు ప్రాంతాలను మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాలు దళితవాడ, కుందూ నదీ తీర ప్రాంతాలు, సలీంనగర్, చామకాల్వ, శ్యాం నగర్, ఎస్బీఐ కాలనీ, విశ్వనగర్ ప్రాంతాలను అధికారులతో కలిసి పర్యటించినట్లు తెలిపారు. ఇందుకు తగిన జాగ్రత్తలు ముందుగా తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రజల భద్రత, రక్షణకు ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా చర్యలు తీసుకుందని వెల్లడించారు. జిల్లా యంత్రాంగంలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలను, వారి ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇందుకు 24 గంటలు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ముంపునకు గురయ్యే గ్రామీణ ప్రాం తాల్లో కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తుఫాను కదలికలను అధికారిక వర్గాల నుంచి వచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుని అప్రమత్తం చేయాలన్నారు. తుఫాను తగ్గేంత వరకు ప్రయాణాలు మానుకోవాలన్నారు. పశువులను, ఇతర పంపుడు జంతువులను సురక్షిత ప్రాంతాలను తరలించాలన్నారు. విపత్కర సమస్యలు తలెత్తితే వెంటనే కంట్రోల్ రూంకు కానీ అధికా రులకు గానీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్, వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి , ఇలియాజ్, భాస్కర్ కమిషనర్ బండి శేషన్న, అధికారులు ఉన్నారు.

ఇద్దరు బిడ్డలతో నదిలోకి దూకి తల్లి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు
- బంధువులకు అప్పగింత

మంత్రాలయం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓతల్లి తన ఇద్దరు బిడ్డలతో తుంగభద్ర నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు వెంటనే స్పందించి వారిని కాపాడరు. ఈఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. వివరాలు.. బెంగుళూరుకు చెందిన సౌమ్య భర్త శివానందతో గొడవపడింది. ఈనెల 27వ తేదీన తన ఇద్దరు పిల్లలైన భువనేష్, చార్వీతో బెంగూళూరు నుంచి రైలెక్కి మంత్రాలయం చేరుకుంది. మంగళవారం తెల్లవారుజామున పిల్లలతో తుంగభద్ర నది వద్దకు వచ్చింది. బెంగుళూరులోని బిడిది పోలీస్‌స్టేషన్ నుంచి మంత్రాలయం పోలీసులకు మహిళ ఇద్దరు పిల్లలతో మంత్రాలయంకు వచ్చారని సమాచారం అందింది. స్పందించిన ఎస్ఐ శివాంజల్, కానిస్టేబుల్ రామకృష్ణ, నాగరాజు నది దగ్గరకు వెళ్లి పరిశీలిస్తుండగా నది దగ్గర తల్లిపిల్లలు తుంగభద్ర నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బెంగుళూరు పోలీసులు సౌమ్య అన్నలైన సనత్‌కుఉమార్, సచిన్, రాహుల్‌కు సమాచారం ఇచ్చారు. మంత్రాలయం వచ్చిన వారి అన్నలకు తల్లి ఇద్దరు పిల్లలను అప్పగించారు. ముగ్గురి ప్రాణాలను కాపాడిన ఎస్ఐ శివాంజల్, రామకృష్ణ, నాగరాజును అభినందించారు.

అభివృద్ధి పనులపై ఆరా

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగర పాలక పరిధిలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. నగరపాలక కార్యాల యంలోని ఇంజనీరింగ్ అధికారులను కలిసి వివరాలివ్వాలని కోరుతున్నారు. లిఖితపూర్వకంగా ఇవ్వాలని విజిలెన్స్ అధికారులు అడిగినా కూడా జాప్యం చేస్తున్నారు. అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సంబంధించి వివరాలు ఇవ్వాలని కోరారు. ఒక్కసారిగా ఇంజనీరింగ్ విభాగంలో అలజడి మొదలైంది.

దొంగ అరెస్టు



నిందితుడితో పోలీసులు

బండిఆత్మకూరు అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం, బీ కోడూరు గ్రామాల్లో జరిగిన చోరీ కేసుల్లో దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. మంగళవారం బండిఆత్మకూరు బస్టాండ్‌లో గూడూరుకు చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి అనుమానంగా తిరుగుతున్నాడు. అతనిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద నుంచి 4తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇవి మండలంలోని నారాయణపురం, బీ.కోడూరు గ్రామాల్లో చోరీ చేసినట్లు నిందితుడు తెలిపారన్నారు. ఈ మేరకు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

పెద్దాసుపత్రిలో వెంటిలేటర్ కోసం యువతి పడిగాపులు



క్యాజువాల్టీలో మహిళకు వెంటిలేటర్‌ను అమర్చిన వైద్యులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిస్థితి సివియస్‌గా ఉన్న యువతి రేష్మా వెంటిలేటర్ కోసం గంటసేపు పడిగాపులు కాసిన ఘటన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాల్టీలో చోటు చేసుకోంది. మంగళవారం రాత్రి మహిళకు ఫిట్స్ రావడంతో నగరంలోని ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లారు. అక్కడ ప్రైవేటు ఆసుపత్రి ఖర్చులు భరించలేక రాత్రి 8 గంటల సమయంలో కర్నూలు జీజీహెచ్‌లోని క్యాజువాల్టీకి వచ్చారు. అక్కడ వెంటిలేటర్ బెడ్ ఖాళీ లేదని క్యాజువాల్టీ బయట అంబులెన్స్‌లో రోగిని గంటసేపు పడిగాపులు కాశారు. ప్రాణలతో కొట్టుమిట్టాడుతున్న రోగి బంధువులు అడ్మిషన్ చేయించుకోవాలని అంబులెన్స్ నుంచి బంధువులు ఎన్నిసార్లు విన్నవించినా వైద్యులు స్పందించలేదు. దీంతో విషయాన్ని హాస్పిటల్ సూపరింటెండెంట్ల దృష్టికి తీసుకెళ్లారు. చివరికి 9.15 గంటలకు రోగిని అడ్మిషన్ చేయించి వెంటిలేటర్ అమర్చారు.

నంద్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు

- అవుకు మండలంలో ఆర్టీసీ బస్సు, లారీ ఢీ
- ఒకరి మృతి.. 16 మందికి గాయాలు
- ఉయ్యాలవాడ మండలంలో కాలువలోకి దూసుకెళ్లిన బస్సు
- 15 మంది ప్రయాణికులు సురక్షితం





ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ, ఇన్‌సెట్‌లో లక్ష్మీదేవి(ఫైల్)

అవుకు/ఉయ్యాలవాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలోని అవుకు, ఉయ్యాలవాడ మండలాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అవుకు మండంలో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. 16 మంది గాయపడ్డారు. ఉయ్యాలవాడ మండలంలో కాలువలోకి బస్సు దూసుకెళ్లింది. 15 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాలివీ.. అవుకు రిజర్వాయర్ సమీపంలోని మలుపువద్ద ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో చాకలి లక్ష్మీదేవి (47) చెందింది. బస్సులో ప్రయాణిస్తున్న మరో 16 మంది ప్రయాణికులు గాయపడ్డారు. చిన్నారులు యశ్విక, పునీత్‌తో పాటు లక్ష్మీదేవి, నాగరాజు (బస్సు డ్రైవర్) నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు, నంద్యాల ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. బనగానపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అవుకు బస్టాండు నుంచి 36 మంది ప్రయాణికులతో తాడిపత్రికి బయలుదేరింది. రిజర్వాయర్ సమీపంలోని మలుపు వద్దకు వచ్చే సరికి ఎదురుగా నాపరాతి బండల లోడ్‌తో వస్తున్న లారీ బస్సును ఢీకొట్టింది. బస్సు కుడిభాగంలోని మూడు సీట్లు నుజ్జయ్యాయి. డీజిల్ ట్యాంక్ లీకయింది.

ఈ రోడ్డు ప్రమాదంలో అవుకు మండలం శివవరం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే ప్రయాణికురాలు అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలైన 16 మంది ప్రయాణికులను 108 ద్వారా అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. డోన్ ఆర్డీవో నరసింహులు, జిల్లా ఆర్ఎం రజియాసుల్తాన, బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథరెడ్డి, అవుకు ఎస్ఐ రాజారెడ్డి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఆసుపత్రికి చేరుకొని గాయపడ్డ వారిని పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యురాలు చౌడమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఉయ్యాలవాడ మండలంలోని సర్వాయిపల్లె గ్రామం వద్ద కోవెలకుంట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి కాలువలోకి దూసుకెళ్లింది. తిరుపతి నుంచి కోవెలకుంట్లకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులో 15 మంది ప్రయాణికులు ఉండగా వారు సురక్షితంగా బయట పడ్డారు. అయితే ఈ బస్సు ఇంజేడు గ్రామం మీదుగా వెళ్లాల్సి ఉండగా అక్కడ ఉన్న కుందరవాగు వంతెనపై వరద నీరు ప్రవహిస్తుండటంతో సర్వాయిపల్లె గ్రామం మీదుగా వెళ్లింది. వర్షం అధికంగా పడుతుండటమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.



కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ఉపాధిలో కొత్త పనులకు బడ్జెట్ రూపకల్పన

- గ్రామాల వారీగా ప్రణాళిక తయారీ శ్రీకారం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద వచ్చే సంవత్సరం (2026-27)కు గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రతి పాదనలు సిద్ధం చేసేందుకు డ్వామా అధికారులు శ్రీకారం చుట్టారు. ఏటా డిసెంబరులోనే కార్మిక బడ్జెట్‌ను తయారు చేస్తారు. అక్టోబరు 3న మొదటి గ్రామసభలో ప్రణాళిక తయారీపై చర్చించాలని, నవంబరు 18న ఆయా గ్రామ పంచాయతీలు బడ్జెట్‌ను రూపొందించాలని, అదే నెల 30న మండల పరిషత్, డిసెంబరులో 15వ తేదీ నాటికి జడ్పీ ప్రణాళికలను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ మొత్తం డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రణాళికను యుక్తదార పోర్టల్‌లో అప్‌లోడు చేయాలని పేర్కొంది. ఒక వ్యక్తికి రోజుకు రూ.307 వేతనం మెటీరియల్ కింద రూ.204.66 ఖర్చు మొత్తం కలిపి రూ.511.66 బడ్జెట్‌ను రూపొందిస్తారు. నాలుగు కేటగిరీల కింద 192 రకాల పనులకు ఈ పథకం కింద అవకాశం కల్పించాలని కేంద్రం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఉంది. ఇందులో వ్యక్తిగత, సామాజికపరమైన పనులు ఉన్నాయి. మొక్కలు నాటడం, ఫీడర్ కెనాల్స్ నిర్మాణం, ఫీల్డ్ బండ్స్, భూమి అభివృద్ధి, కమ్యూనిటీ వాటర్ హార్వెస్టింగ్ పాండ్స్ రీచార్జ్ కిట్లు, సర్క్యులేషన్ ట్యాంకుల నిర్మాణం, వర్షం నీటి సంరక్షణ పనులు, ట్రెంచ్‌లు, చెక్‌డ్యామ్‌లు సాగునీటి బావుల నిర్మాణం, పంట కాలువలు చెరువుల్లో పూడిక తీతలు, కందకాల తవ్వకాలు, పండ్లతోటల పెంపకంతో పాటు తుఫాన్ షెల్టర్లు, ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

పంచాయతీ స్థాయిలో..

గ్రామ పంచాయతీ స్థాయిలో ఈ బడ్జెట్ రూపకల్పనకు కమిటీలు ఏర్పాటు చేశారు. దీనిలో సాంకేతిక సహాయకులు, జీఎస్టీ, సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, క్షేత్ర సహాయకులు పంచాయతీలో సీనియర్ మేట్లు, లైన్ డిపార్టుమెంట్ల నుంచి సభ్యులు ఉంటారు.ఈ బృందాన్ని ఏపీవో పర్యవేక్షిస్తారు. గ్రామసభల షెడ్యూల్ పీవో, ఎంపీడీవోలు నిర్ణయిస్తారు. కూలీలు, హేబిటేషన్లు ప్రాతిపదికన మూడు, నాలుగు రోజుల్లో ప్రణాళిక తయారు చేయాలి. ఈసారి కొత్త సంవత్సరం చేపట్టబోయే పనుల్లో గ్రామాల్లో పాడిపశువుల కోసం గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లకు ప్రాధాన్యం ఇస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు మూడున్నర లక్షల మందికి జాబ్‌కార్డులు ఇచ్చారు. ఈ రెండు జిల్లాల్లో 5 లక్షల మంది దాకా సీజన్‌లో పనులు చేస్తున్నారు. ప్రస్తుతం క్రియాశీలక జాబ్‌కార్డులు రెండున్నర లక్షల దాకా ఉన్నాయి. రెండు జిల్లాలో కలిపి వేసవి సీజన్‌లో 2 లక్షల మంది దాకా పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఉపాధి ప్రణాళిక తయారు చేస్తాం



వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రైతులు, కూలీలకు పనులు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలను గ్రామాల వారీగా రూపొందించాలని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 16న పర్యటిస్తున్నందున ఆ కార్యక్రమం పూర్తయిన తర్వాత గ్రామాల వారీగా గ్రామ సభలు ఏర్పాటు చేస్తాం. దశల వారీగా ఉపాధి ప్రణాళికను గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు తయారు చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాము. - **వెంకటరమణయ్య, పీడీ**

వ్యక్తి మృతదేహం లభ్యం

కోడుమూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాలకుర్తి గ్రామ పరిధిలోని పొలాల దారిలో ఓవ్యక్తి మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న కొందరు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఇన్‌చార్జి సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐ స్వామి సిబ్బందితో చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడు దేవనకొండ మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన దస్తగిరి ఆచారి(38)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మృతుడు దస్తగిరి ఆచారికి అదే మండలంలోని చెల్లెలి చెలిమ గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మతో 16 ఏళ్ల క్రితం వివాహ మైంది. వారికి ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. వెంకటేశ్వరమ్మ ఆశా వర్కర్‌గా పనిచేసేది. దస్తగిరిఆచారి ప్రైవేటు వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య ప్రవర్తన సరిగా లేదంటూ ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం వెంకటేశ్వరమ్మ ఆశా వర్కర్ జాబ్ వదులుకుని పెద్దపాడు మకాం మార్చింది. మూడు నెలల క్రితం దస్తగిరిఆచారి భార్యతో రాజీ చేసుకుని అందరూ కలిసి ఉన్నారు.

అతడు 15 రోజుల క్రితం బళ్లారికి వెళ్లాడు. అక్కడి నుంచి భార్యకు తరచూ ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. మూడురోజుల క్రితం తిరిగివచ్చిన దస్తగిరిఆచారి భార్య ప్రవర్తనపై గొడవపడ్డాడు. ఈ విషయమై సోమవారం కర్నూలులో బామ్మర్దులు దాడిచేసి కొట్టారని దస్తగిరిఆచారి సోదరికి ఫోన్‌చేసి మొరపెట్టుకున్నాడు. మంగళవారం ఉదయం ప్యాలకుర్తి వద్ద శవమై కనిపించాడు. ఇన్‌చార్జి సీఐ, ఎస్ఐ డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంను రంగంలోకి దింపారు. మృతుడి తండ్రి వెంకటరాముడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉర్దూ చదవాలంటే.. ఊరు వదలాల్సిందే..!

- పదో తరగతితోనే చదువును ఆపేస్తున్న విద్యార్థులు
- మిథ్యగా మారిన ఉర్దూ జూనియర్ కళాశాల
- ఇంటర్ కోసం 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే
- నత్తనడకన ఉర్దూ ఐటీఐ కళాశాల నిర్మాణం



చాగలమర్రిలో నాలుగేళ్లుగా నత్త నడకన సాగుతున్న కళాశాల

ఉర్దూ దక్షిణాసియాలో మాట్లాడే ఇండో-ఆర్యన్ భాష. భారతదేశంలో అధికారికంగా గుర్తించిన భాషల్లో ఉర్దూ ఒకటి. ఉర్దూకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నప్పటికీ నేటికీ పలుచోట్ల ఉర్దూను చిన్న చూపు చూస్తున్నారు. ఉర్దూ మీడియం స్కూళ్లు ఉన్నా కాలేజీలు మాత్రం చాలా తక్కువ అనే చెప్పవచ్చు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ పరిసర మండలాల విద్యార్థులు ఉర్దూ మీడియంలో ఇంటర్మీడియట్ చదవాలంటే ఊరి వదలాల్సిన పరిస్థితి నెలకొంది. ఉర్దూను ఎక్కువగా మైనార్టీ విద్యార్థులు (బాల, బాలికలు) చదువుతారు. ముఖ్యంగా బాలికలు పదో తరగతి వరకు ఆయా మండలాల్లో ఉన్న ఉర్దూ పాఠశాలల్లో చదువును కొనసాగించి చదువులను ఆపేస్తున్నారు. కారణం దగ్గర్లో సరైన ఉర్దూ జూనియర్ కళాశాలలు లేకపోవడమే. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బయటికి పంపలేక వారి భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు.

ఆళ్లగడ్డ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉర్దూ చదువుకునే విద్యార్థులకు పదో తరగతి వరకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇక ఇంటర్‌లో చేరాలంటే అసలు సమస్య. ఎందుకంటే ఆళ్లగడ్డ నుంచి అటు.. ఇటుగా ఇంటర్ కళాశాలలు. దాదాపు 50కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. నంద్యాలకు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉర్దూ కళాశాల విద్య మిథ్యగా మారింది. చాలా మంది ముస్లిం మైనార్టీ విద్యార్థులు చేసేదేమీ లేక చదువు మానుకొని ఇంటి పనులకు పరిమితమౌతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీల విద్యాభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు.

'ప్రధాన మంత్రి జన వికాస్' పేరిట..

మైనార్టీ విద్యార్థులకు విద్య, నైపుణ్యాభివృద్ధి స్వయం సంవృద్ధి కోసం ప్రధాన మంత్రి జనవికాస్ పేరిట పథకాన్ని ప్రారంభించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరు మండలాలు ఈ పథకానికి ఎంపిక య్యాయి. వీటిలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్న చాగలమర్రి, శిరివెళ్ల మండలాలను ఎంపిక చేశారు. మండలాల్లో రూ 6కోట్లతో ఉర్దూ ఐటీఐ కళాశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈపనులు నాలుగేళ్లగా నత్తనడకన సాగుతున్నాయి. చాగలమర్రి మండలంలోని పెద్దవంగలి గ్రామంలో రూ 3.99 కోట్ల తో ఐటిఐ కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టి అర్థంతరంగా నిలిపి వేశారు. అలాగే శిరివెళ్ల లో రూ 1.99 కోట్లతో ఉర్దూ ఉన్నత పాఠశాల నిర్మాణం ఇంకా ప్రారంభించ లేదు.

ఇంటికే పరిమితం

ఉర్దూ పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఇంటర్ చేయాలంటే నంద్యాల, కడప జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి. చాలా మంది ముస్లింలు తమ పిల్లలను దూర ప్రాంతానికి పంపలేక ఇంటి పనులకు పరిమితం చేస్తున్నారు. చాగలమర్రి, శిరివెళ్ల, ఆళ్లగడ్డ మండలాల్లో ముస్లింల జనాభా అధికంగా ఉంది. ఆళ్లగడ్డ మండలంలోని ఓబులంపల్లెలో 60 శాతం మంది ముస్లింలున్నారు. ఉర్దూ పాఠశాలలో కేవలం నలుగురు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక పోవడం, ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తగు చర్యలు తీసుకోక పోవడం తో ఏడాదికి ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గు ముఖం పడుతూ వస్తుంది. మరి ముఖ్యంగా పది తరకు చదవు కొన్న తరువాత ఏమి చదవాలి. ఎక్కడ చదవాలి అన్న ప్రశ్న కూడా తల్లితండ్రులలో ఉండడంతో ఉర్దూపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని రెండు మండాల్లో ఉర్దూ కళాశాలల నిర్మాణాలు చేపట్టి త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

చదువు మాన్పించి వేస్తారేమోనని..



చాగలమర్రిలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నా. మా పాఠశాలలో మాకంటే ముందు చదువుకున్న అక్కలు పదో తరగతి చదివి ఏమి చేయాలో తెలియక చదువులు మానేశారు. మాకు కూడా అదే గతి పడుతుందేమోనని, తల్లిదండ్రులు చదువులు మాన్పించి వేస్తారేమోనని భయమేస్తోంది. ● **మాబుచాన్, పదో తరగతి, చాగలమర్రి**

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు



ఆళ్లగడ్డలోని పాత మసీదు సమీపంలో ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఇందులో పదో తరగతి నడపడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. ముస్లింలు ఎక్కువగా ఉన్న ఓబులంపల్లె ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ● **శోభావివేకవతి, ఎంఈవో, ఆళ్లగడ్డ**

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ప్రైవేటు ట్రావెల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్

నంద్యాల టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ట్రావెల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి తెలిపారు. 11 కేసులు నమోదు చేసి రూ.25,500 జరిమానాలు విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు శ్రీకాంత్, ప్రదీప్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నందికొట్కూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నందికొట్కూరులో మంగళవారం చోటు చేసుకున్నది. వివరాలిలా.. వైసీపీ నాయకుడు అబుబక్కర్ సిద్ధిక్ పట్టణంలోని పాతబస్టాండ్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. సాయంత్రం వర్కర్లు లేకపోవడంతో గ్రైండర్ స్విచ్‌ను బంద్ చేసేందుకు వెళ్లగా విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెంది నట్లు వైద్యులు ధ్రువీకరించారు. సిద్ధిక్ మృతిపై వైసీపీ నాయ కులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ ధార సుధీర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

యాజమాన్య పద్ధతులే పంటలకు రక్ష

నంద్యాల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : యాజమాన్య పద్ధతులను పాటిస్తేనే పంటలకు రక్షణ ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి అన్నారు. మంగళవారం కానాల, పాండురంగాపురం గ్రామాల్లో ప్రాంతీయ వ్యవసాయ శాస్త్రవేత్తలు నీలిమ, చైతన్య, ఏడీఏ జయప్రకాశ్‌రెడ్డితో కలిసి వర్షాలకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ప్రసాదరావు, సిబ్బంది ఉన్నారు.

పంటలను కాపాడుకోవాలి

ఆత్మకూరు రూరల్/కొత్తపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక వర్షాల నుంచి పంటలను కాపాడుకోవడానికి పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ సీనియర్ శాస్త్రవేత్తలు వెంకటరమణమ్మ, మల్లీశ్వరరెడ్డి, బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని నల్లకాలువ, వడ్లరామాపురం,కురుకుంద, కొత్తపల్లి మండలం కొత్తపల్లి, నందికుంట, వీరాపురం, గువ్వలకుంట్ల గ్రామాల్లో ఏడీఏ హేమలతతో కలిసి అధిక వర్షాలకు నీట మునిగిన వరి, మొక్కజొన్న, పత్తి, మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. స్థానిక స్థానిక వ్యవసాయాధికారి అమీరున్నిసా బేగం, ఎంపీఈవోలు, వీఏఏలు, రైతులు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

నంద్యాల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కానాల గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ బాల గురప్పపై అధికారులు విచారణ చేపట్టారు. అవినీతికి పాల్పడుతున్నారన్న ఫిర్యాదు మేరకు మంగళవారం గ్రామ సచివాలయంలో డ్వామా ఏపీడీ ఇస్మాయిల్, ఏవీవో పరమేశ్వర్, ఏపీవో గణేష్ విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో పాటు ఉపాధి కూలీలను విచారించారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఏపీడీ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ బాలగురప్ప ఉపాధి పనులకు రాని 42 మందికి మస్టర్లు వేసినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. నివేదికను పీడీకి సమర్పించనున్నట్లు తెలిపారు. నంద్యాల తాలుకా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.




ఆత్మకూరు, నంద్యాల పట్టణాల రహదారులపై నిలిచిన వర్షపు నీరు



మహానందిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు



లింగాల గ్రామంలో ధాన్యంపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు



మిడుతూరులో మొక్కజొన్నపై కప్పిన పట్టాలు

రోజంతా ముసురు

- లోతట్టు కాలనీల్లో నిలిచిన వర్షపు నీరు
- దయనీయంగా మారిన రైతుల పరిస్థితి

నంద్యాలటౌన్/ఆత్మకూరు/నందికొట్కూరు/శ్రీశైలం/కొత్తపల్లి/పాములపాడు/గడివేముల/పాణ్యం/మిడుతూరు/మహానంది, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో మొంథా తుఫాన్ ప్రభావంతో రోజంతా ముసురు వర్షం కురిసింది. కొన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం, ఈదురుగాలులతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటే హడలిపోతున్నారు. ఈదురుగాలుల తీవ్రత ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పలు ప్రధాన రహదారులు, లోతట్టు కాలనీ ల్లో వర్షపునీరు చేరడంతో ప్రజలు కొంత అసౌకర్యానికి లోనయ్యారు. చేతికొచ్చిన మొక్కజొన్న, గింజదశలో ఉన్న వరిపంటను భారీగా దెబ్బతిస్తోంది. వ్యవసాధికారులు పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దాంతో రాకపోకలకు వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆత్మకూరు పట్టణంలో రాత్రివరకు 4.24 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. శ్రీశైల క్షేత్రంలో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. స్వామివారి గర్భాలయ స్పర్శ దర్శనాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వివిధ ప్రాంతాల భక్తులు క్యూలైన్లో బారులుదీరారు.



నందికొట్కూరులో వర్షానికి తడుస్తున్న మొక్కజొన్న ధాన్యం



కొత్తపల్లి: సింగరాజుపల్లెలో ధాన్యంపై పట్టాలు కప్పి కాపాడుకుంటున్న రైతులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో

నంద్యాల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్ సూచించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో పలు ప్రాంత్రాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించామన్నారు. పట్టణంలోని శ్యాంనగర్‌లో కరుణామయస్కూల్‌లో, గోపాల్‌నగర్ శివానందస్కూల్, విశ్వనగర్ సాయిబాబా గుడి కామన్‌హాల్, దాబరాల్‌మసీద్ సమీపం లోని సైయింట్ జోషఫ్ స్కూల్, బైర్మల్‌వీధిలోని మున్సిపల్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ముంపుప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరి సురక్షితంగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

శ్రీశైలంలో సినీ దర్శకుడు బండ్ల గణేశ్

శ్రీశైలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ప్రముఖ సినీ దర్శకుడు బండ్ల గణేష్ దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి స్వామివారి గర్భాలయ స్పర్శ దర్శనం చేసుకుని ప్రాంగణలోని పరివార దేవతలను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

అభివృద్ధే ధ్యేయం

- గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులివ్వండి
- మండల సమావేశంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సర్పంచులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో చేసే అభివృద్ధి మరో 50 ఏళ్ల గుర్తుండి పోవాలని అన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల ప్రతిపాదనలన్నింటిని ఆమోదించాలని సూచించారు. మొంథా తుఫాన్ ప్రభావం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మట్టిమిద్దెల్లో ఉన్న వారిని ఇతర ఇళ్లలోకి చేర్చాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

వర్షానికి లీక్ అవుతున్నా..

మొంథా తుఫాన్ ప్రభావం వల్ల కురుస్తున్న వర్షానికి మండల పరిషత్ భవన్‌లోని సమావేశ మందిరం లీక్ అవుతున్నా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా ఎంపీపీ నిధుల నుంచి సమావేశ మందిరాన్ని మరమ్మతు చేసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. సమావేశంలో బ్రాహ్మణకొట్కూరు సొసైటీ చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తంరెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య



సమావేశపు హాల్‌లో నిలిచిన వర్షపు నీరు

మద్దతు ధరతో పత్తి కొనుగోలు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని జాయింట్ కలెక్టర్ కార్తీక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు క్వింటా మద్దతు ధర రూ.8110తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తేమ 8శాతం మించకూడదని ప్రతి ఒక్క శాతానికి రూ 81.10 తగ్గుతుందన్నారు. 12 శాతం కంటే ఎక్కువ మించి ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయదన్నారు. సీసీఐ కేంద్రానికి తీసుకువచ్చేటప్పుడు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ తీసుకురావాలన్నారు. రైతులు కపాస్‌కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చునన్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన

నంద్యాల కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం కాళికాంబ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం 108వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీనారాయణ, అర్చకు లు రాఘవేంద్రచారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే సంజీవనగర్ రామాలయంలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామికి 108 వెండి పుష్పాలతో అష్టాదళపాదపద్మారాధన సేవ నిర్వహించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే అఖిలప్రియ


సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ/ దొర్నిపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వర్షాలకు నష్టపోయిన రైతులకు ఆదుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్యమంత్రి చంద్రబాబును విన్నవించారు. మంగళవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్యమంత్రిని కలిసి పలు సమస్యలను ఆయనకు వివరించారు. వర్షాలతో రైతులు కోసి ఆరబెట్టిన ధాన్యం 1,35,000 క్వింటాళ్లు వరకు నష్టం వాటిల్లిందని తెలియజేశారు. స్పందించిన సీఎం చంద్రబాబు తుఫాను తగ్గిన తరువాత మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. అలాగే కోత దశలో ఉన్న పంట కూడా 88 క్వింటాళ్ల మేర నష్టం వాటిల్లిందని వారికి కూడా ఆదుకోవాలని తెలిపామన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి: దొర్నిపాడు మండలంలో హెల్త్ అండ్ వెల్త్ ద్వారా ప్రజల నుంచి డబ్బులు కట్టించుకొని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోని బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. సీఎం చంద్రబాబు స్పందించి డీజీపీకి ఆదే శాలు ఇచ్చి డబ్బులు ఇచ్చి మోసపోయిన ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు.

త్యాగమూర్తులను స్మరించుకుందాం

• డోన్ డీఎస్పీ శ్రీనివాసులు


రక్తదానం చేస్తున్న దాతలతో డీఎస్పీ శ్రీనివాస్

డోన్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): త్యాగమూర్తులను స్మరించుకుందామని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో క్లబ్ హౌస్‌లో డీఎస్పీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ మన రాష్ట్రంలో విధి నిర్వహణలో 14 మంది అమరుల య్యారన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 522 మంది రక్తదానం చేశారు. వారందరికీ ప్రశంసాపత్రాలు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్, బేతంచెర్ల, బనగానపల్లె, ప్యాపిలి సీఐలు, ఎస్‌ఐలు శరత్ కుమార్ రెడ్డి, మమత పోలీసులు పాల్గొన్నారు.

లీగల్ నోటీసులు ఇవ్వడం దారుణం

చాగలమర్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న వంగలి గ్రామంలో కొత్తకొట్టాల కాలనీలో ఇరవై ఏళ్లుగా నివాసం ఉంటున్న తమకు లీగల్ నోటీసులు ఇవ్వడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ నాయకులతో కలిసి బాధితులు తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రామయ్య, షేక్షావలి, జిలాన్‌బాషాలు మాట్లాడుతూ 2005లో కొత్తకొట్టాల కాలనీలో 141 సర్వే నంబర్‌లో 40 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. ఆ స్థలాన్ని అమ్మిన వ్యక్తులు వెంకటేశ్వర్‌రెడ్డి ఆ స్థలం తనదేనని, మీకు ఎలాంటి హక్కులేదని లాయర్ నోటీసులు ఇచ్చారని అన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

ఎడతెరిపిలేని వర్షాలు

• పొంగిన వాగులు, వంకలు
• నిలిచిన రాకపోకలు • నీట మునిగిన పొలాలు

శిరివెళ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శిరివెళ్ల-రుద్రవరం ప్రధాన రహదారిలోని మాలవాగు వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. శిరివెళ్ల సర్కిల్ సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐ చిన్న పీరయ్య వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బందితో అప్రతమత్తంగా వ్యవహరిస్తున్నామన్నారు.

కూలిన మట్టిమిద్దె: శిరివెళ్లలోని పసుల పేటలో నివాసం ఉంటున్న పసుల నందీశ్వరుడు అనే వ్యక్తికి చెందిన మట్టిమిద్దె మంగళవారం తెల్లవారుజామున కూలిపోయింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోయినా నివాస గృహం కూలిపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు.

రుద్రవరం: మండలంలోని ఆలమూరు గ్రామంలో చాకలి లక్ష్మీదేవి అనే మహిళకు చెందిన మట్టి మిద్దె మంగళవారం వర్షానికి కూలింది. వర్షం కురుస్తున్నందున మట్టి మిద్దె ముందుభాగంలో కూర్చుని ఉండగా వెనుక గది పైకప్పు కూలింది. సమాచారం ఎతెలుసుకున్న ఎంపీడీవో భాగ్యలక్ష్మి, కార్యదర్శి పాములేటి బాధితులను పరామర్శించారు.

బనగానపల్లె: మండలంలో సోమవారం రాత్రి 11గంటల నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురుస్తోంది. మండలంలోని ఇల్లూరుకొత్తపేట, బనగానపల్లె, యాగంటిపల్లె, సాధు కొట్టం, మీరాపురం, పసుపుల, పుసుపుల తండా, చెర్లోకొత్తూరు, క్రిష్ణగిరి, తదితర గ్రామాల్లో రైతులు మొక్కజొన్న పంటలను కోసి ఆరబెట్టారు. అయితే అధిక వర్షాలకు పంటలు తడిచిపోయాయి. భారీ వర్షాలకు వంకలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. బనగానపల్లె నుంచి టంగుటూరు మీదుగా నంద్యాల వెళ్లే రహదారిలోను, టంగుటూరు అప్పలాపురం రహదారిలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో టంగుటూరు- నంద్యాల పట్టణానికి రాకపోకలు నిలిచిపోయాయి.

ఉయ్యాలవాడ: కురుస్తున్న వర్షాలకు మండలంలోని గ్రామాల్లో మట్టి మిద్దెల్లో నీరు కారుతోంది. పంట పొలాల్లో నీరు నిలుస్తోంది. ఉయ్యాలవాడ బస్టాండ్ ఆవరణలోని రహదారులు జలమయంగా మారాయి. పడిగెపాడు గ్రామంలో మిరప పంట నీటి మునిగింది.

దొర్నిపాడు: మండలంలో కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న ధాన్యం తడిచిపోయింది. దొర్నిపాడులో పత్తి పొలంలో వర్షపు నీరు చేరింది. అలాగే లోతట్టు కాలనీల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరింది.

డోన్ రూరల్: కురుస్తున్న వర్షాలకు పంటలు నీట మునిగాయి. డోన్ మండలం వెంకటపురంలో కంది పంటలో వర్షపు నీరు నిలిచింది.


టంగుటూరు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


శిరివెళ్ల రహదారిలో..


వెంకటాపురంలో కంది పంటలో నిలిచిన వర్షం నీరు



దొర్నిపాడులో పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు, పడిగెపాడులో నీట మునిగిన మిరప పంట


శిరివెళ్లలో కూలిన మట్టిమిద్దె

ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి

బేతంచెర్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చేరిన నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని యూటీఎఫ్ సీని యర్ నాయకుడు మనోహర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంఆర్‌సీలో నూతన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమం మండల అధ్యక్ష కార్యదర్శులు మద్దిలేటిరెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులకు సర్వీసు రిజిస్టర్లు (ఎస్‌ఆర్) పంపిణీ చేశారు. ఈసందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ సర్వీసులో ఉన్న 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మిన హాయింపు ఇవ్వాలని, ఐఆర్ 12వ పీఆర్‌సీ ప్రకటించాలని, డీఏ బకాయిలు పీఎఫ్ ఖాతాలో జమ చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల స్థానాల్లో విద్యావలంటీర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నాగశేషు, నూతన ఉపాధ్యాయులు షేక్షావలి, మన్మథరావు, గణేష్, రవీంద్రబాబు, మహేష్, మురళి, కృష్ణ, రోజా, కుమారి, భార్గవి, పుష్పావతి, పావని అరుణ పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టులదే కీలక పాత్ర



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ రాజశేఖర్

కొలిమిగుండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భారతదేశ స్వాతంత్రోద్యమంలో ఎందరో కమ్యూనిస్టు నాయకులు కీలకపాత్ర వహించారని ఎస్వీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని బెలుం గుహల వద్ద సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల శిక్షణా తరగతులు మంగళవారం రెండో రోజూ కొనసాగాయి. దేశ నిర్మా ణంలో ఏమాత్రం పాత్రలేని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ గొప్పలు చెబుతూ రాజ్యాంగాన్నే మార్చే విధంగా ప్రవర్తిస్తుండటం దారుణమని నేతలు విమర్శించారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, రామాంజనేయులు, బ్రహ్మారెడ్డి, సోమన్న, పుల్లయ్య, పెద్దయ్య పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

• జిల్లా వ్యవసాయధికారి మద్దిలేటి


చాగలమర్రిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులు మొంథా తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయధికారి మద్దిలేటి సూచించారు. ఆదివారం 'అదే వాన.. తగ్గని వరద' అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన వ్యవసాయాధికారులు మంగళవారం చాగలమర్రిలో వర్షానికి దెబ్బతిన్న మొక్క జొన్న పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలతో పంటలు దెబ్బతినకుండా రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా బయటకు పోయేలా చూసుకోవాలని అన్నారు. మొక్కజొన్న కోసి ఆరబెట్టిన రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ప్రతిపాద నలు పంపించామని అన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీఏ విజయ శేఖర్, ఏవో రంగనేతాజీ, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరం: అనుమతి వచ్చిన వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో మొక్కజొన్నను కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయధికారి మద్దిలేటి అన్నారు. మండలంలోని నరసాపురం, ఆలమూరు గ్రామాల్లో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులతో సమీక్ష నిర్వహించారు. మొలకెత్తిన మొక్కజొన్నలు కొనుగోలు చేయాలని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అనుమతి కోరతామని తెలిపారు. ఆళ్లగడ్డ ఏడీఏ విజయశేఖర్, ఏవో సుమతి, రైతు సేవాకేంద్రం సిబ్బంది ఉన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ


మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

బనగానపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు మద్యం దుకాణాలను కర్నూలు జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి తనిఖీ చేశారు. మద్యం విక్రయాలను ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారానే విక్రయించాలని, యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. మద్యం బాటిల్‌ను స్కాన్ చేసి మద్యం నాణ్యతను తెలుసు కోవాలన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అందించారు. ప్రభుత్వం నిబంధనల మేరకే విక్రయాలు సాగించాలన్నారు. అనంతరం బనగానపల్లె ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బందికి క్రైమ్ రివ్యూను, ఏపీ ఎక్సైజ్ సురక్షయాప్‌ను వివరించారు. కల్తీమద్యం కాని, నాటుసారా అమ్ముతున్నట్లు తెలిస్తే 9440902589 నెంబర్‌కు సమచారం ఇవ్వాలన్నారు. ఆమె వెంట బనగానపల్లె ఎక్సైజ్ సీఐ సతీష్, ఎస్ఐ కమలాకర్, నాగరాజు పాల్గొన్నారు.

టీజీపీ గండి మరమ్మతులకు చర్యలు

చాగలమర్రి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట గ్రామ సమీపంలోగల 84 కి.మీ వద్ద ఏర్పడ్డ అండర్‌టర్నల్ లీకేజీ మరమ్మతులు చేపట్టినట్లు టీజీపీ డీఈలు రత్నరాజు, గురు మూర్తి తెలిపారు. మంగళవారం మొంథా తుఫాన్ హెచ్చరికతో టీజీపీ కాలువను పరిశీలించారు. కాలువ వెంట వెళ్లి గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. వీరి వెంట డీఈ అనిల్‌రెడ్డి, డీసీసీ చైర్మన్ శజ్జారెడ్డి, టీడీపీ నాయకులు రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

ఉయ్యాలవాడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు దరఖాస్తున్న చేసుకోవాలని హౌసింగ్ ఏఈ నరసింహారావు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద గృహాలు మంజూరు అవుతాయన్నారు. వీటికి ప్రభుత్వం ఒక్కో గృహ నిర్మాణానికి రూ.1.59 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. అవసరమైన వారు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, ఉపాధి హామీ జాబ్‌కార్డు, స్థలానికి సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్లను నవంబరు 5వ తేదీలోపు గ్రామ సచివాలయాల్లో గానీ, హౌసింగ్ ఆఫీసులో గానీ అందజేయాలన్నారు.

విజయవంతం చేయండి

కొలిమిగుండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా మందకృష్ణ మాదిగ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ నాయకులు దస్తగిరి, నాగాం జనేయ పిలుపునిచ్చారు. కొలిమిగుండ్లలో నవంబరు 1న హైదరాబాద్ లో జరగనున్న కార్యక్రమంపై సమీక్షించారు. కార్యక్రమంలో రామ చంద్ర, వెంకటరాముడు, మోహన్, పెద్దకొసి పాల్గొన్నారు

గ్రావెల్ రోడ్డు నిర్మాణం

కొలిమిగుండ్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు కోరుమానుపల్లె నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుండం ఆంజనేయస్వామి ఆలయం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని టీడీపీ నాయకులు ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం మంత్రి ఆదేశంతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, ఓబయ్యయాదవ్, సుదర్శనరెడ్డి, విజయబాస్కరరెడ్డి, బాస్కరరెడ్డి పాల్గొన్నారు

వాహనాల దారి మళ్లింపు

రుద్రవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉండటంతో రుద్రవరం నుంచి నంద్యాలకు వెళ్లే వాహనాలను దారి మళ్లించినట్లు ఎస్ఐ మహ్మద్‌రఫి మంగళవారం తెలిపారు. చిన్నకంబలూరు మెట్ట నుంచి గాజులపల్లె మీదుగా వాహనాలను మళ్లింపు చేశామన్నారు. వాహనదారులు గమనించి శిరివెళ్ల దారిలో వెళ్లకుండా గాజులపల్లె దారిలో వెళ్లాలని సూచించారు.

వెంకటాపురం చెరువుకు జలకళ


నిండుకుండలా వెంకటాపురం చెరువు

డోన్ రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు మండలంలోని వెంకటాపురం గ్రామంలోని చెరువు జలకళ సంతరించుకుంది. చెరువులోకి వర్షం నీరు చేరి నిండుకుండాలా మారింది.